## శ్రీ రుక్మిణి సత్యభామ వేణుగోపాల స్వామివారి కళ్యాణ బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న ప్రశాంత్ రెడ్డి



**దశ, ఇబ్రహీంపట్నం:** ఇబ్రహీంపట్నం నియోజకవర్గం తుర్కయంజాల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో నిర్వహించిన శ్రీశ్రీశ్రీ రుక్మిణి సత్యభామ వేణుగోపాల స్వామివారి కళ్యాణ బ్రహ్మోత్సవ మహోత్సవాల్లో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి (బంటి) పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయానికి చేరుకున్న ప్రశాంత్ రెడ్డి కి ఆలయ నిర్వాహకులు, స్థానిక నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వాదాలు పొందారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ప్రశాంత్ రెడ్డి శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు.

## మల్కాజిగిరిలో ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు

❖ *227 మంది పట్టివేత.. 11 మందికి జైలు శిక్ష*





**దశ, మల్కాజిగిరి:** మల్కాజిగిరి ట్రాఫిక్ పోలీసులు 17052026 నుంచి 23052026 వరకు వారాంతంలో ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించి మొత్తం 227 మంది మద్యం సేవించి వాహనాలు నడిపిన ఉల్లంఘనదారులను పట్టుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం పట్టుబడిన వారిలో 185 మంది ద్విచక్ర వాహనదారులు, 12 మంది త్రిచక్ర వాహనదారులు, 29 మంది నాలుగు చక్రాల వాహనదారులు, ఒకరు భారీ వాహన డ్రైవర్ ఉన్నారు. బ్లడ్ ఆల్కహాల్ కాన్సంట్రేషన్ (BAC) స్థాయిల ఆధారంగా 197 మంది 36 mg/100 ml నుంచి 200 mg/100 ml మధ్య, 20 మంది 201 mg/100 ml నుంచి 300 mg/100 ml మధ్య, మరో 10 మంది 300 mg/100 ml కంటే ఎక్కువ BAC స్థాయిలతో పట్టుబడినట్లు తెలిపారు. పట్టుబడిన వారందరినీ గౌరవ న్యాయస్థానం ముందు హాజరుపరుస్తామని ట్రాఫిక్ పోలీసులు వెల్లడించారు. ఇక గత వారం 293 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులను కోర్టులు పరిష్కరించగా, అందులో 11 మందికి జరిమానాతో పాటు జైలు శిక్ష, ఇద్దరికి జరిమానాతో పాటు సామాజిక సేవ, 280 మందికి జరిమానా విధించినట్లు అధికారులు తెలిపారు. మద్యం సేవించి వాహనం నడపడం తీవ్రమైన నేరమని పోలీసులు హెచ్చరించారు. మద్యం మత్తులో వాహనం నడిపి ప్రాణాంతక ప్రమాదాలకు కారణమైతే భారతీయ న్యాయ సంహిత2023లోని సెక్షన్ 105 కింద కేసులు నమోదు చేసి గరిష్టంగా 10 సంవత్సరాల జైలు శిక్షతో పాటు జరిమానా విధించే అవకాశం ఉందని స్పష్టం చేశారు.

## తెలంగాణ ట్రేడ్ యూనియన్ భవన నిర్మాణం ఉప్పల్ మండల యూనియన్ ఆధ్వర్యంలో కొంగరి ఉమాదేవి కి 2లక్షల ఆర్థిక సాయం



**దశ, ఓయూ :** తెలంగాణ ట్రేడ్ యూనియన్ కొంగరి ఉమాదేవి కార్మికురాలు మరణం.. లేబర్ కార్డు ద్వారా మరణించిన ఉమాదేవికి రెండు లక్షల రూపాయలు తెలంగాణ ట్రేడ్ యూనియన్ భవన నిర్మాణం ఉప్పల్ మండల యూనియన్ సభ్యులు ఆర్థిక సాయం అందించారు. కొంగర్ ఉమాదేవి కుమారుడు సోను కుమార్ కి సంఘం సభ్యులు తన్నీరు శ్రీనివాసరావు జిల్లా ఉపాధ్యక్షులు గౌరవ అధ్యక్షులు సుబ్బారావు యూనియన్ ప్రెసిడెంట్ టి కృష్ణ జిల్లా సెక్రెటరీ టి మాధవరావు ఉపాధ్యక్షులు ఉంచాల శ్రీనివాసరావు డిండి శ్రీనివాసరావు వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం ప్రభాకర్ ఏం శీను భక్తుల నారాయణ క్యాషియర్ మాధవ మైనార్టీ అధ్యక్షుడు ఎండి సలీం మండల ఇన్చార్జి పొన్నాల మహేందర్ కృపాకర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు

## మానవసేవయే మాధవుని సేవ



**దశ సూర్యాపేట ప్రతినిధి :** మానవునికి సేవ చేసినట్లయితే మాధవునికి సేవ చేసినట్లేనని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయం ప్రధాన అర్చకులు నల్లాన్ చక్రవర్తుల వేణుగోపాల చార్యులు తెలిపారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయం వద్ద బాటసారులకు వేసవి సందర్భంగా వికాస తరంగిణి ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజసేవే లక్ష్యంగా వికాస తరంగిణి సేవలు అందిస్తుందని తెలిపారు. మండుటెండల్లో ప్రజల దాహార్తిని తీర్చుటకు గత 15 రోజులుగా వికాస తరంగిణి ఆధ్వర్యంలో దాతల సహకారంతో మజ్జిగ పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు వికాస తరంగిణి సభ్యులు పాల్గొన్నారు.

# యాదాద్రిలోకి కిక్కిరిసిన భక్తజనం...





❖ *ధర్మ దర్శనానికి మూడు గంటలు ప్రత్యేక దర్శనానికి రెండు గంటల సమయం*

**దశ, యాదగిరిగుట్ట :** శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో పోటెత్తారు. ఆదివారం సెలవు దినం కావడంతో తెల్లవారుజాము నుంచే కొండపైకి, కిందకు భక్తుల తాకిడి మొదలైంది. మధ్యాహ్ననికి రద్దీ తారాస్థాయికి చేరి, మండే ఎండలతో భక్తులు ఉక్కిరిబిక్కిరి అయ్యారు.

**క్యూలైన్లలో నరకయాతన**

స్వామివారి దర్శనానికి వచ్చిన భక్తులతో సర్వదర్శనం, ప్రత్యేక దర్శనం క్యూలైన్లు పూర్తిగా నిండిపోయాయి కొండపైన ఏర్పాటు చేసిన జర్మన్ షెడ్లు, హాళ్లన్నీ భక్తులతో కిటకిటలాడాయి . 43 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలతో చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళలు సొమ్మసిల్లి పడిపోయిన ఘటనలు పలుచోట్ల చోటుచేసుకున్నాయి.సర్వదర్శనానికి 3 గంటలకు పైగా పట్టడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

**కిక్కిరిసిన పార్కింగ్, ట్రాఫిక్ జామ్**

కొండ కింద ఏర్పాటు చేసిన అన్ని పార్కింగ్ స్థలాలు వాహనాలతో నిండిపోయాయి టోల్ గేట్ నుంచి కొండపైకి వెళ్లే దారిలో కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి.

**దేవస్థానం తరపున మంచినీటి ప్యాకెట్లు పంపిణీ చేస్తే బాగుండు:** ప్రస్తుతం దేవస్థానం సిబ్బంది అక్కడక్కడా మంచినీరు అందిస్తున్నా, అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తుల రద్దీకి అది సరిపోవడం లేదు. క్యూలైన్లలో, షెడ్లలో గంటల తరబడి వేచి ఉండే భక్తులకు దేవస్థానం తరపున ఉచితంగా వాటర్ ప్యాకెట్లు, మజ్జిగ ప్యాకెట్లు, ORS ద్రావణం పంపిణీ చేస్తే బాగుంటుందని భక్తులు సూచిస్తున్నారు. వేసవి తీవ్రత దృష్ట్యా ఇది అత్యవసరమని వారు అభిప్రాయపడుతున్నారు

**అంచనా**

ఈరోజు ఒక్కరోజే 80 వేల మందికి పైగా భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. రానున్న శనివారం, ఆదివారాల్లో కూడా ఇదే స్థాయిలో రద్దీ ఉండే అవకాశం ఉందని, భక్తులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని దేవస్థానం అధికారులు సూచించారు.




## సంక్షేమ పథకాలే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం : పెద్దిరెడ్డి రాజా

**దశ సూర్యాపేట ప్రతినిధి :** సంక్షేమ పథకాలే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం అని మాజీ మార్కెట్ చైర్మన్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పెద్దిరెడ్డి రాజా అన్నారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో కొత్త బస్టాండ్ ఫ్లైఓవర్ కింద ఎమ్మెల్సీ, టిపిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ పుట్టినరోజు సందర్భంగా డిసిసి జనరల్ సెక్రెటరీ పెద్దిరెడ్డి కళ్యాణ్ చక్రవర్తి ఆధ్వర్యంలో కేక్ కటింగ్, అల్పాహార కార్యక్రమానికి వారు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు ఎంతో మేలు చేస్తున్నాయని తెలిపారు. పేదలు, రైతులు, మహిళలు, యువత సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ వైస్ చైర్మన్ తండు శ్రీనివాస్ యాదవ్, టిపిసిసి రాష్ట్ర ఉపాధ్యక్షులు అనుములపూరి రవి డిసిసి కార్యదర్శులు నేరెళ్ల మధు, షేక్ మీరా, పోలేబోయిన లింగరాజు, గాజుల రాము, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ నాయకులు అనుముల పూరి రాజీవ్, జిల్లా కార్యదర్శి విజయ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## యాదగిరిగుట్ట కొండపైన వర్తక సంఘాని రద్దు చేయాలి



❖ *భారీ ఎత్తున నిరసన ర్యాలీ...*

**దశ, యాదగిరిగుట్ట :** యాదాద్రి పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో యాదగిరిగుట్ట కొండపైన వర్తక సంఘాని రద్దు చేసి టెండర్లు వేయాలని కోరుతూ యాదగిరిగుట్ట టౌన్ లో MRO కార్యాలయం నుండి పాతగుట్ట చౌరస్తా వరకు ర్యాలీగా వచ్చి బస్ స్టాండ్ వద్ద ధర్నా నిర్వహించడం జరిగింది.. ధర్నా నిర్వహించిన ఆందోళనకారుల పోలీస్లు చెదరగొట్టారు.ఈ కార్యక్రమం లో స్థానికులు అధిక సంఖ్యలో పాలుగొన్నారు. ఈ కార్యాక్రమాన్ని ఉద్దేశించి కమిటీ సభ్యులు మాట్లాడుతూ యాదగిరిగుట్ట కొండపైన వర్తక సంఘాన్ని రద్దుచేసి టెండర్ వేయాలని తద్వారా దేవస్థానానికి 20 నుండి 30 కోట్ల ఆదాయము సమకూరుతుందని తద్వారా భక్తులకు మెరుగైన సదుపాయాలు కల్పించవచ్చనన్ని మరియు స్థానిక నిరుద్యోగులకు ఉపాధి కల్పించవచ్చునని తెలిపారు.. ఈ కార్యక్రమం లో కాటబత్తిని ఆంజనేయులు, పల్లపు బాలయ్య, బండ రామస్వామి, దేవపూజ అశోక్,గ్యాదపాక బాల నరసయ్య, బుగ్గా ఆంజనేయులు, మాటూరి బాలయ్య,దండబోయిన వీరేష్,బంధారపు మల్లేష్, కొన్నె సంజీవ,బండి అనిల్, ముక్కెర్ల వెంకటేష్, నర్సింహా, గోపగాని ప్రసాద్,దొమ్మాట ప్రభాకర్, మందోజు నరేష్, కర్రె శ్యామ్,కొన్నె ప్రశాంత్,గుండు కుమార్,సుధాగాని శివ,వాల్మీకి అజయ్, గ్యాదపాక క్రాంతి, పలుగుల సురేష్, శ్రీనాథ్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



## శ్రీ చిలుకేశ్వర స్వామి ఆలయంలో ఈరోజు కోటిలింగ స్థాపనకు దాతలు ముందుకు రావాలి

❖ *ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి*

**దశ, ఓయూ:** ఉప్పల్ చిలుకనగర్లో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. చిలుకానగర్‌లో నిర్మిస్తున్న శ్రీ చిలుకేశ్వర స్వామి ఆలయంలో ఈరోజు కోటిలింగ స్థాపనకు దాతల సహకారాన్ని కోరుతూ ఆలయ కమిటీ సభ్యులు సమావేశం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు .ఈ కార్యక్రమానికి ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి, స్థానిక చిలుకానగర్ బి ఆర్ ఎస్ నాయకులు బన్నాల ప్రవీణ్ కుమార్ అతిథులుగా విచ్చేశారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం, వారు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి మరియు నిర్మాణ పనులకు తమ వంతు పూర్తి సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు. కోటిలింగాల స్థాపనకు ప్రజలు స్వచ్ఛందగ ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. దాతలకు అందించే శివలింగాలను మరియు దాతల వివరాలు నమోదు చేసుకునే కార్యక్రమాన్ని ఎమ్ ఎల్ ఎ చేతుల మీదుగా ప్రారంభించినారు.

ఈ కార్యక్రమం లో చిలుకానగర్ స్థానిక నాయకులు ,ప్రజలు , భక్తులు పాల్గొన్నారు. మరోవైపు ఆలయ నిర్మాణాన్ని మరింత వేగంగా పూర్తి చేసేందుకు భక్తులు, దాతలు ముందుకు రావాలని ఆలయ కమిటీ విజ్ఞప్తి చేస్తోంది. ఈ పవిత్ర కార్యంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, తమ శక్తిమేర విరాళాలు అందించి సహకరించాలని కోరారు.

## ఆచార్య నాగార్జున యూనివర్సిటీ సర్టిఫికెట్లు చెల్లుబాటు అయ్యేలా తెలంగాణ ప్రభుత్వం చొరవ చూపాలి

❖ *తెలంగాణ రాష్ట్ర విద్యార్థి నాయకుడు ఓయూ జేఏసీ లీడర్ డి.సలీమ్ డిమాండ్..*

**దశ, ఓయూ:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం 2014 సెక్షన్ 95 ప్రకారం 10 సంవత్సరాల వరకు విద్య ఎక్కడైనా చదువుకోవచ్చని రాసి ఉంది దీనివలన తెలంగాణ రాష్ట్రంలో 1,24,524 మంది విద్యార్థులు ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో డిగ్రీలు , పీజీ లు చదివారు తీరా సర్టిఫికెట్ల చేతికి వచ్చిన తర్వాత టీజీపీఎస్సీ వివిధ ప్రభుత్వ ఉద్యోగానికి చదివి ఉద్యోగం సాధించిన తర్వాత సర్టిఫికెట్ వెరిఫికేషన్ సమయంలో సర్టిఫికెట్లు చెల్లవని చెప్పడం తో విద్యార్థులు మానసిక ఆందోళనకు గురవుతున్నారు. సమయం ,డబ్బు వేచించి చదివారు దయచేసి ప్రభుత్వం మన తెలంగాణ రాష్ట్ర విద్యార్థులకు సర్టిఫికెట్లు విద్య ,ఉద్యోగాల్లో చెల్లుబాటు అయ్యే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిందిగా మనస్ఫూర్తిగా కోరుచున్నాను. ఈ కార్యక్రమంలో కర్ణాకర్, మధు, వెంకట్ ,అశోక్, గోవర్ధన్, పాల్గొన్నారు.



03

జ్వాల
# దశ
నిజం.. నిర్భయంగా..

సోమవారం
25-05-2026

# ఖమ్మం-భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

ఖమ్మం: వైరా | సత్తుపల్లి | పాడేరు | మధిర

భద్రాద్రి కొత్తగూడెం: కొత్తగూడెం | ఇల్లందు | పినపాక | భద్రాచలం | అశ్వరావుపేట

WWW.DASHANEWS.COM



## అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



**దశ, మణుగూరు:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు దూసుకెళ్తోంది. పినపాక నియోజకవర్గ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తున్న పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని కమలాపురం గ్రామంలో రూ.50 లక్షల అంచనా వ్యయంతో నిర్మించబోయే సైడ్ డ్రైన్ నిర్మాణ పనులకు ఘనంగా శంకుస్థాపన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, కమలాపురం గ్రామ ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా ఎదుర్కొంటున్న డ్రైనేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించేందుకే ఈ పనులు చేపడుతున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా సంక్షేమ పాలనలో భాగంగా గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారని, ప్రతి కాలనీలో మౌలిక వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. వర్షాకాలంలో నీరు నిల్వ ఉండకుండా ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ఆధునిక సైడ్ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నామని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకొని వెంటనే స్పందించడం ప్రజాప్రతినిధిగా తన బాధ్యత అని పేర్కొన్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పినపాక నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, హౌసింగ్ AE పావని, మున్సిపల్ DE శ్రీనివాస్, వర్కింగ్ ఇన్స్పెక్టర్ అనిల్, టౌన్ అధ్యక్షులు, జిల్లా ముఖ్య నాయకులు, సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, కార్యకర్తలు, మహిళలు, గ్రామ ప్రజలు మరియు తదితరులు పాల్గొన్నారు.



## ఏమిరా ఈ పరిస్థితి

❖ *మృతదేహం భుజాలపై.. ఆసుపత్రి వద్ద ఆవేదన*

**దశ, భద్రాచలం:** భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో అత్యంత హృదయ విదారకమైన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. భద్రాచలం పట్టణానికి చెందిన ఓ వృద్ధుడు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో చనిపోతే కనీసం ఉచితంగా ఇవ్వవలసిన అంబులెన్స్ సైతం లేకపోవడం, లేదా ఇవ్వకపోవడంతో చనిపోయిన వ్యక్తిని తీసుకొని భుజాలపై వేసుకొని ఇంటికి వెళ్తున్న కుటుంబ సభ్యులను చూస్తే ఈ సమాజంలో మనం ఎందుకు బ్రతుకుతున్నామా అనేది అర్థం కాని పరిస్థితి. చనిపోయిన వ్యక్తి బాడీని అలా మోసుకు వెళ్తుంటే ప్రభుత్వ ఆసుపత్రి యంత్రాంగం నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుంది. ఇటువంటి సంఘటనలు గతంలో ఇతర రాష్ట్రాలలో జరిగినప్పుడు అయ్యో అని బాధపడ్డాము. కానీ ఈరోజు అది మన వరకు వచ్చిందంటే ఈ ప్రభుత్వం, ప్రభుత్వంలోని అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుంది. ఈ సంఘటనకు సంబంధించి కారణమైన ప్రతి ఒక్కరిని సస్పెండ్ చేయాలని పట్టణ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిని ప్రతి రోజు మన జిల్లా కలెక్టర్ గారు తనిఖీ చేస్తూ మెరుగైన వైద్యం అందించండి సకల సదుపాయాలు కల్పించండి అని ఎంత మొత్తుకున్నా సిబ్బంది ప్రవర్తనలో ఎటువంటి మార్పు రాకపోవడం విచారించదగ్గ విషయం. తక్షణమే వీరందరిపై జిల్లా కలెక్టర్ గారు తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## గిరిప్రసాద్ ఆశయాలు సాధించాలి



**దశ, ఖమ్మం:** మాజీ ఎంపీ, సిపిఐ జాతీయ మాజీ ఉప ప్రధాన కార్యదర్శి నల్లమల గిరి ప్రసాద్ 29వ వర్ధంతి సందర్భంగా ఖమ్మంలోని గిరి ప్రసాద్ భవన్ లో ఆయన చిత్రపటానికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు భాగం హేమంతరావు కలిసి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు పూలమాలవేసి నివాళులర్పించారు. శేషగిరి పేరులోని చివరి రెండు అక్షరాలతో గిరి ప్రసాద్ గా పేరు మార్చుకున్నారని సాంబశివరావు తెలిపారు. ఆయన నిస్వార్థమైన రాజకీయ నాయకుడిగా ఎదిగారని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కార్యదర్శిగా పనిచేసి, జాతీయ ఉప ప్రధాన కార్యదర్శి వరకు ఎదిగారన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొన్న గొప్ప నాయకుడని వారు తెలిపారు.

## TUWJ-IJU తృతీయ మహాసభలు విజయవంతం



**దశ, కొత్తగూడెం:** కొత్తగూడెం జిల్లాలో తెలంగాణ రాష్ట్ర యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు టియుడబ్ల్యూజె ఐజేయు తృతీయ జిల్లా మహాసభలు విజయవంతం అయింది. ఆదివారం జిల్లా కేంద్రమైన కొత్తగూడెంలో జరిగిన మహాసభలకు జిల్లాలోని అన్ని మండలాల జర్నలిస్టులు తరలివచ్చారు. ఈ సందర్భంగా TUWJ, IJU జర్నలిస్ట్ యూనియన్ నాయకులు ప్రసంగించారు. రానున్న రోజుల్లో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరుకు కృషి చేయనున్నట్లు తెలిపారు. అదేవిధంగా జర్నలిస్టులకు హెల్త్‌కార్డులు, అక్రిడియేషన్ కార్డులు మంజూరు ఇలా అనేక అంశాలపై TUWJIJU యూనియన్ నాయకులు కృషి చేస్తున్నారన్నారు. అనంతరం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జర్నలిస్టుల సంఘం అధ్యక్షులుగా రత్నంని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## బూత్‌స్థాయిలో BJPని బలోపేతం చేయాలి



**దశ ఖమ్మం:** భారతీయ జనతా పార్టీని బూత్ స్థాయిలో బలోపేతం చేయాలని బీజేపీ జాతీయ నాయకులు అన్నారు. ఆదివార ఖమ్మం జిల్లా శాఖ అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు అధ్యక్షతన ప్రశిక్షణ తరగతులలో భాగంగా మొదటి రోజు శిక్షణ తరగతులు జరిగాయి. ఈ కార్యక్రమంలో జాతీయ నాయకులు, కిసాన్ మోర్చా గోలి మధుసూదన్ రెడ్డి ఐదవ కాలాంశం తీసుకోని ప్రసంగించారు. సమాజంలో వ్యక్తి పరివర్తన చెందిన వాడిగా ఉండాలన్నారు. మంచి, చెడు గ్రహించి జీవించాలన్నారు. భారతీయ జనతా పార్టీ ద్వారా సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రతి ఒక్క నాయకులు, కార్యకర్తలు ఐకమత్యంతో కష్టపడి పని చేయాలని ఆయన పిలుపునిచ్చారు. దీనికి మంద సరస్వతి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఖమ్మం జిల్లా శాఖ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## యువత ప్రాచీన విద్యలు తెలుసుకోవాలి

❖ *BJP రాష్ట్ర అధ్యక్షులు రామచందర్‌రావు*



**దశ, ఖమ్మం:** ఖమ్మంలో స్వామి వివేకానంద విద్యా పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "భారతీయ ప్రాచీన యుద్ధ కళల శిక్షణ - వేసవి ఆవాస శిబిరం"ను బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్ర రావు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ఆయుధ పూజ కార్యక్రమంలో పాల్గొని, భారతీయ సంస్కృతి, ధార్మిక విలువలు, ఆత్మరక్షణ విద్యలను యువతకు చేరవేసే ఇటువంటి శిబిరాలు సమాజ నిర్మాణానికి ఎంతో అవసరమని పేర్కొన్నారు. పది రోజుల పాటు నిర్వహించనున్న ఈ శిబిరంలో విద్యార్థులకు కత్తిసామన్నారు. కర్రసాము, ధనుర్విద్య తదితర భారతీయ యుద్ధ కళల్లో ప్రత్యేక శిక్షణ అందించబడనుంది. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు, ఖమ్మం జిల్లా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## నిబద్ధతతో ఉద్యోగ బాధ్యతలు నిర్వహించాలి



❖ *ఖమ్మం జిల్లా కలెక్టర్ టిఎస్.దివాకర్*

**దశ, ఖమ్మం:** ఖమ్మం జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణలో భాగంగా నిర్వహించిన ఉద్యోగ సాధన - కనెక్టింగ్ టాలెంట్ విత్ ఆపర్చునిటీస్" కార్యక్రమం జాబ్ మేళా క్రింద ఎంపికైన 618 మంది అభ్యర్థులకు జాబ్‌మేళా ప్రొవిజనల్ ఆఫర్ లెటర్లు( ఉద్యోగ నియామక పత్రాలు) లను శనివారం ఖమ్మం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాకలెక్టర్ దివాకర టిఎస్, అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి అందజేశారు. ఉద్యోగాలు సాధించిన యువతకు ఇది మొదటి అడుగు మాత్రమేనని, కంఫర్ట్ జోన్ నుంచి బయటకు వచ్చి కష్టపడి పనిచేస్తే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని, చిన్న స్థాయి ఉద్యోగంతో ప్రారంభించి ప్రస్తుతం మంచి స్థాయికి ఎదిగిన యువత ఉదాహరణలు తమకు తెలిసి ఉన్నాయని, కృషి, పట్టుదలతో మంచి భవిష్యత్తు సాధించవచ్చని కలెక్టర్ యువతకు ప్రోత్సాహం ఇచ్చారు.



## యోగా భారతీయ సంస్కృతికి ప్రతీక

❖ *BJP రాష్ట్ర నాయకులు తూళ్ల వీరేందర్ గౌడ్*

**దశ, భద్రాచలం:** యోగా భారతీయ సంస్కృతికి ప్రతీక అని BJP రాష్ట్ర నాయకులు తూళ్ల వీరేందర్ గౌడ్ తెలిపారు. ఆదివారం భద్రాచలం కార్యశాలలో ప్రముఖ యోగ గురువు శ్రీ దుములపురం సత్యనారాయణ ఆధ్వర్యంలో యోగ కార్యక్రమంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తూళ్ల వీరేందర్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగం భారతీయ సంస్కృతికి ప్రతీకగా, ఆరోగ్యకరమైన జీవన విధానానికి మార్గదర్శిగా నిలుస్తోంది. శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతతను అందించే యోగాన్ని ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం నియోజకవర్గ బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## మణుగూరులో వాహనాల తనిఖీ చేసిన సీఐ నాగబాబు

**దశ, మణుగూరు:** మణుగూరు పట్టణంలో ఆదివారం రాత్రి మణుగూరు సీఐ నాగబాబు ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన వాహనదారుల డ్రైవింగ్ లైసెన్సలు, బండి కాగితాలు, ఇన్సూరెన్స్, పొల్యూషన్ సర్టిఫికెట్‌లు క్షుణ్ణంగా పరిశీలించారు. అదే విధంగా ప్రతి ఒక్క ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ ధరించి ప్రయాణాలు చేయాలన్నారు. నిబంధనలు పాటించని వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అదేవిధంగా పెండింగ్‌లో ఉన్న చలాణాలు వెంటనే చెల్లించాలని, లేని ఎడల వాహనాలు వాహనలు సీజ్ చేయడం జరుగుతుందన్నారు.



## సభ్యత్వ నమోదులో ఉత్సాహంగా పాల్గొనాలి

❖ *మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు*

**దశ, కొత్తగూడెం:** కొత్తగూడెం నియోజకవర్గంలో BRS పార్టీ డిజిటల్ పద్ధతిలో సభ్యత్వ నమోదు ప్రక్రియలో ప్రతి ఒక్క ముఖ్య నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొని విజయవంతం చేయాలనిచేయాలని కొత్తగూడెం మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు తెలిపారు. జిల్లా ఇంచార్జ్ ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు ఆదేశాల మేరకు, సభ్యత్వ నమోదు ఇంచార్జ్ రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర సూచనలతో, మాజీ మంత్రి మరియు బీఆర్ఎస్ పార్టీ కొత్తగూడెం నియోజకవర్గ ఇంచార్జ్ వనమా వెంకటేశ్వరరావు నాయకత్వంలో ఆయన స్వగృహంలో ఆదివారం నిర్వహించిన సమావేశం ఉత్సాహభరితంగా జరిగింది. బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు మరియు డిజిటల్ శిక్షణ కార్యక్రమాల నేపథ్యంలో జరిగిన ఈ సమావేశానికి కొత్తగూడెం నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న పాల్వంచ, కొత్తగూడెం, సుజాతనగర్ డివిజన్లు అలాగే పాల్వంచ, చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి, సుజాతనగర్ మండలాలకు చెందిన సమన్వయ కమిటీ సభ్యులు, ముఖ్య నాయకులు, పార్టీ కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. బూత్ స్థాయి కమిటీల ఏర్పాటు, సభ్యత్వ నమోదు వేగవంతం, డిజిటల్ యాప్ వినియోగం మరియు పార్టీ బలోపేతంపై నాయకత్వం దిశానిర్దేశం చేసింది. ప్రతి కార్యకర్త పార్టీ కోసం సమిష్టిగా పని చేసి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పార్టీ నినాదాలతో మార్మోగిపోగా, కార్యకర్తల ఉత్సాహం సమావేశానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

## పాండురంగాపురంలో అగ్ని ప్రమాదం



**దశ, పినపాక:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలం పాండురంగాపురం గ్రామంలో అగ్ని ప్రమాదం చోటుచేసుకుని రెండు ఇళ్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. పాండురంగాపురం గ్రామంలో గొగ్గలి అబ్బయ్య, అతని కుమారుడి ఇళ్లు అగ్ని ప్రమాదంలో కాలిపోయాయి. అయితే ఈ ఘటనలో ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదని తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. పొలాల్లో నిప్పులు పెట్టడం, అలాగే వీస్తున్న ఈదురుగాలుల కారణంగా మంటలు వ్యాపించి ఈ ప్రమాదం జరిగినట్లు ఆయన వెల్లడించారు. రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ పంట పొలాల్లో నిప్పులు వేయవద్దని తహసీల్దార్ సూచించారు. ఎస్సై సురేష్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ రమేష్, సర్పంచ్ ఈసం భవతి, అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు.